కథ :

# సంఘం

అల్లం రాజయ్య

## 1

వీరారెడ్డి ధుమధుమ లాడుతున్నడు – మాటిమాటికీ తల విదిలించుకుంట కాలు గాలిన పిల్లోలె, నిప్పుతొక్కిన కోతోలె ఎగరెగిరి పడ్తండు. తన మనుసుల తనే ఏందేందో గులుక్కుంటాండు – వీరారెడ్డి దొర గట్లెందుకున్నట్టు ? దొరకు తక్కువైందేంది ? అసలు వీరారెడ్డి ఇయ్యాల్ల మంచాల్నుంచి లేసుడే మంచి యాల్లన లేవలే – లేవంగనే రోజు లచ్చిందేవి పటాన్ని చూసేటోడు ఇయ్యాల్ల పెద్ద పెండ్లాం మొఖం సూడాల్సచ్చింది – గట్ల చూసినందుకే ఏం జరుగనున్నదోనని నారాజి అయిపోయిండు. గందుగనే పెద్ద పెండ్లాన్ని “ఏమే – పొద్గాల[1] పొద్గాల నాకండ్ల బడద్దని నీ కెన్నిసార్లు సెప్పిన ఖాతరు చేత్తలేవ్[2]” అన్నడు. అలవాటుపడ్డ మనిషిగన్క – ముఖం ముడ్సుకొని ఎల్లిపోయింది. ముఖం మాడిన మక్క కంకోలె మాడ్సుకొని మంచాల్నుంచి లేసి సుట్ట ముట్టిచ్చి లోగింట్ల[3] నుంచి ఈవలకచ్చిండు – ఈవలకచ్చి ముఖం ఇంకింత మాడ్సుకున్నడు.

బంకుల[4]ముందు చేతులుకట్టుకొని తలలు వేల్లాడేసుకొని పాలేరోల్లునిలుసున్నరు. “నాగండ్లు కట్టబోయినోల్లు గిట్లచ్చిండ్రేంద”ని వీరారెడ్డి అనుకోకముందే పెదపాలేరు గట్టయ్య ముంగటి కచ్చిండు.

“అగ్గెరుఖాము[5] నాగండ్లేసుకొని లచ్చపల్లని బాపతు గుట్టకింది సెలుకలకు[6] దున్నబోయినమ్ పటేలా ! నాగండ్ల కొడారిప్పి[7] సయిజేసుకునేటాల్లకు నీ బాంచెన్ ఎక్కన్నుంచచ్చిండో లచ్చిమల్ల దురికచ్చి నాగండ్లిప్పేసిండుండ్రి” సావు కబురు సల్లంగ చెప్పిండు.

“మీరేం జేసిండ్రి ఆడిగుల్ల లంజకొడుకుల్లాలా ! వాడు ఆ గులాపు[8] లంజకొడుకు నా నాగండ్ల కడ్డమత్తె గిద్దెలకుగిద్దెలు పెట్టుబడి తీస్కుంట మీరు చేతులూపుకుంట గీడికచ్చిండ్రి – మానాలు లేవు బంచత్[9].... దొర పాలేరోల్లంటె ఖదరు లేకుంటయ్యింది. థు మీ నోట్లె.... ఏంపుటక పుట్టిండ్రి – ఆడిపుటుక[10]పుడితె ఎవడన్న సేసుక బతుకు – థు.....”

---

1. పొద్దటివేళ 2. లెక్కచేస్తూలేవు 3. లోపలి యిల్లు 4. ఇంటి ముందరి అరుగు
5. ఉదయం 6. చేన్లకు 7. కొడారి (తాడు)ను విప్పి 8. బానిస 9. తిట్టుమాట
10. ఆడజన్మ

"అదిగాదు పటేలా! అయినన్నడు...."

"అయినెవ్వరాౘి- నీ మొగుడు! వాని పెండ్లాన్ని పెదమాదిగోడెత్తుక పోను- వాడేమంటడు?"

గట్టయ్య ముఖం మాడ్చుకున్నడు. వాలిపోయిన చెవులు రాసుకున్నడు. మనుసులోపటి మంట ముఖంలోపటి మంట కన్పియ్యకుంట తల వంచుకున్నడు. తలవంచి అలుకు జల్లిన ఆకిలి[11]ని అటెనుక[12] వీరారెడ్డి కాల్లను, కాల్లకున్న చెప్పులను చూసిండు. అత నెనుకున్న ముసలి పాలేరు ఏంముంచుక రాగలదోనని గడగడ వనికిండు. అసలే అంగిపోయిన[13]మనిషి ఇంకింత అంగిండు. ఇగ అందట్ల పడుసోడు దొరగారి బఱ్ఱె పెయ్యోలె నిమ్మకు నీరెత్తినట్టు నిలుసుండి మొగులుకెల్లి[14] అటునుంచి ఏపసెట్టు కొమ్మల్లకు సూసుకుంట నిలుసున్నడు మాట పలుకు లేకుంట- పడుసోనికి వీరారెడ్డి మొఖం సూడాల్నంటె రోతగ వున్నది. అతను గుడుక[15] రైతు కూలి సంఘంల చేరిండు మరి.

వీరారెడ్డి కొత్తకొండీరన్న పూనినట్టుగ తిడ్తనే ఉన్నడు. నోట్లెనుంచి పురుగులు రాలినట్టుగ, గబ్బువాసన గుప్పుమన్నట్టుగ, ఒకటే బూతులు. కూలోల్లను, రైతులను, సంఘాన్ని కలివిడిగా విడివిడిగా అంకసెండాలం కడిగిపోత్తుండు. తిట్టి తిట్టి నీర్స మచ్చింది- గొంతు బొంగురు బోయింది. పొద్గాల[16] ఇంకా చాయ్ గుడుక తాగలే- అదిగాక సారన్న[17] పుక్కిలించలే- ఇగ మరెట్ల? అలసటచ్చింది. అరుగుమీని కుర్సిల కూకున్నడు- కూకుంది గద్దకండ్ల టపటప లాడిచ్చిండు- గప్పుడు బక్కసిక్కిన గట్టయ్యను సూసిండు.

"తాములు[18]పటేలా తాములుకురాండిౘి- మామీన ఉరుకులాడ్తెట్ల?" గట్టయ్య అన్నడు.

"అపుతల ఇల్లుగాలిపోతంటె పేలాలేరుక బుక్కుత నన్నట్టు తాములేందిర?.... తాములు తర్దెం.... ఇల్లు ముంచిండ్రు గదరా!"

గప్పుడు గట్టయ్య అసలు సంగతి చెప్పిండు;

"అబ్బ! ఆడెక్కన్నుంచచ్చిండో పటేలా! ఒడిసెల రాయోల్గె అచ్చిండు. అచ్చినోడు సీదా నాగండ్ల కాడికి రాలే- తూర్పు పుట్టగడ్డమీనికెక్కి నిలుసుండి సేనంత పారసూసిండు- సూసి కీకేసిండు- పులితీర్గ[19] అరిసిండు. గానితోనేందని[20] నాగండ్లు

11. వాకిలిని 12. ఆ తరువాత 13. వంగిపోయిన 14. మబ్బులపై 15. కూడా
16. పొద్దున 17. సారా అయినా 18. శాంతం 19. వలె 20. వానితో ఏమని

సాగిచ్చినం. అయిలిగాని నాగలి ఓసుట్టు పోయచ్చింది- ఇగ నీజాంచెన్ ! అట్ల ఉరికచ్చిండు బాణం పుల్లోలె ! అచ్చి, అయిలిగాని నాగలి ముంగట నిలబడ్డడు."

"ఎందుకోంట ? మెడబలిమి లమ్డికొడుకు ! పురుగు బుసి దిని పుట్టలుండ బుద్ధయితలేదా ? మాకెలవుడా ![21] ఏమనుకున్నడో ? నేను తలుచుకుంటె- వారీ ! గట్టిగ- మసిరా.... మసి జేత్త- నీ తల్లి ఏమనుకుంటందో- వాని తాడుదొంగ[22]...."

"అడన్నడు.... గీ సేను మీ పటేల్‌దిగాదు_ ఇగో గీ రొండు రెక్కలు ఇరుసుకొని పెల్లపెల్లకు పురిసెడు సెత్తురు సారెడు సెమట జేసుకొని సాపు జేసుకొన్న- ఏడేండ్లవట్టి ఏదో దున్నుకున్నడు నా కడుపుమీసకొట్టి, నా పోరగాండ్లను ఆకలికి సంపిండు. ఇగ గా ఆటలేం సాగయి- ఇగో మంచి మాటకు సెప్పుతన్న; నాగండ్లి దుసుకొని సీదా ఎల్లిపోండ్రి-" గట్టయ్య యిట్ల చెప్పి 'గంతేకాదుర ఆడన్నది' అని అందరికెల్లి సూసిండు.

గట్ల లచ్చింపల్లయ్య అసలేదని ఆల్లందరి కెరికె- పడుసోడు లచ్చింపల్లయ్యన్న మాటల యాదికి తెచ్చుకున్నడు: "వారీ ! గట్టన్నా ! మీకండ్ల ముంగట్నె నా కడుపుమీస కొట్టిండు_ సూర్యపాలిచ్చి ఏడేండ్లు దున్నుకున్నడు- మల్ల బాకీ ముట్టలేదంటండు_ గిది నాయమేన ? మీరే ఆలోసించుండ్రి" 'నిచ్చమే'[23] నన్నరు పాలేరోల్లు. అందరు కూడబలుక్కొని గిట్లంటె గిట్లందా మనుకొని ఇంటికచ్చిండ్రు.

"వాని నోట్లె మొ.... గప్పుడు మీరేంజేసిండ్ర లంజకొడుకా" వీరారెడ్డి అరిచిండు.

"దెహెఁ లంజకొడుకు, గింజకొడుకని నోటికచ్చినట్టదురుతన్నవ్- మంచిమాట రాదా ?" సోరోడు బానయ్య అన్నడు గట్టిగ.

"ఏందేందిర !.... నీయవ్వను కుక్కలు దెం....! ఇప్పటి మాటేందిర ?" వీరారెడ్డి పక్కల బాంబుపడ్డట్టుగ ఉలికిపడి అన్నడు. అని ఊకుండలే- ఊకుండకుంట ఏంజేయాల్నో తోచలే- తోచక చెప్పందుకున్నడు- ఇసిరేసిండు. సెప్పు సోరోనికి తాకుతెట్లుండేదో ? ముసలోనికి తాకింది- నొసలుకు బొడుసచ్చింది. అసలే ఫికరు పడ్తున్న ముసలోనికి మూలిగే నక్కమీన తాటిపండు పడ్డట్టయ్యింది. ఎందుకో ముసలోడు నొసలు సూసుకొని మెడెత్తి చూసిండు. నోరుమీద కప్పుకున్న మీసాల సందుల్లో "అన్నన్న ! సంపుతివి గదరా దొరోడా !" అన్నమాట ఆగిపోయింది- కని[24] కండ్లల్ల గసొంటి[25]బావం దొరకు కన్పిచ్చింది.



21, 22 తిట్టు మాటలు 23. నిజమే 24. కాని 25. అటువంటి

బానయ్య ముసలోని నుదురు పునికి సూసిండు. వీరారెడ్డి బస్మసురుడే- అడెవడో బాగోతం సెప్పినట్టుగ గ సేతులతోని ఎందరి కొంపల్నో బస్మం జేసిండు. కని బానయ్య సివుడు కాడు- సివునికి మూడోకన్ను వున్నదో? లేదో? ఉంటే అది మండేదో? బస్మంచేసేదో నా కెరుకలే గని సివుని సడ్డకుని తీర్గ అతని రొండుకండ్లు మండుతున్నయి. గ సూపుల్ల మంటలే ఉంటే వీరారెడ్డి, గయినె బంగుల కాలి బూడి దయ్యేదే। పాలేరోల్లు గజగజ వనికిండ్రు- బానయ్య ఏంజేత్తడోనని. కని బానయ్య ఏంజెయ్యకుంటనే పెద్దపెద్ద జంగలేసుకుంట పెద్దరువాజకెల్లి నడిసిండు- పెద్దరువాజను ఝాడిచ్చి తన్ని బయటి కెల్లిపోయిండు- మిలమిల సూడంగ.

వీరారెడ్డి తల గి(్రున తిరిగింది- అయిదు నూర్లెకరాల దొరను, బార్లమేడలు గల్గిన దొరను- ఎండి బంగారు, పాటికీ బర్లు, నాగటికెడ్లు, పెద్దనోరు, ఊరునిండా, ఊరవతలా పలుకుబడి గల్గిన ఫలాని ఖాందానికి వారసుడైన దొరను- ఇద్దరుపెండ్లాలు, ఇనుపపెట్టెల డబ్బు, పట్నంల కొడుకులు, పరాయిదేశంల కూతురు గల్గిన దొరను.... పెయికంగిలేని[26] మూతిమీద సరిగ్గ మీసాలన్న మొలువని బానడు- కాకుంటె తొస్సె దుర్గి, తొంటె కొంరని కొడుకు బానడు- గంత మాటన్నడు.

'మారె జనం తెలివి మీరిపోతండ్రు- సాటుమాటుకు కమునిట్లు నా కొడుకు లత్తండ్రింటే ఆశ్లేం జేత్తరనుకున్న- తొండలు ముదిరి పోతన్నయ్- ఎట్లా?.... ఈ లంజకొడుకుల నెట్ల అనుగ్గొట్టాలె?' వీరారెడ్డి లేసి నిలబడ్డడు.

ముసలోడు ఇంకా వనుకుతనే ఉన్నడు.

"బాసని కెంత పొగరచ్చింది. ఈపు మీన ముల్లు బెరిగింది బంచత్। వానవ్వ వాని మదమంచకుంటె నీ తల్లి.... సూస్కో- అదిగో.... అదెపాయె పిల్లకాకంటె...." వీరారెడ్డి పండ్లు పటపట కొరికిండు.

గట్టయ్య ఏందో చెప్పుతనే ఉన్నడు. వీరారెడ్డి మనసు కెక్కలే- ఇంట్లకు నడిసిండు. పొద్దు పైకి నడిసింది- పాలేరోల్లు ఎడ్లకొట్టంకెల్లి నడిసిండ్రు నవ్వుకుంట.

## 2

గుంపు చింత కింద, మైసమ్మ గుడిముంగట అంబటాల్లకు- జనం కుప్ప కూడిండ్రు. సంకల్ల పిలగండ్ల నెత్తుకొని, నెత్తిగోక్కుంట ఆడోల్లు- పేస్తున్న తాళ్లు

26. వంటిపై బొక్కాలేని

సేనుకుంటనే, ముడుత్తన్న సెప్పు ముడుసుకుంటనే సబ్బండ వర్ణాలు మాదుగులు, మన్నేలు, కాపులు, పెర్కలు, గొల్ల, కుర్మ, సాకల్లు, మంగల్లు, కుమ్మరి, కమ్మర్లు— ఎందరైతేంది? ఎన్ని కులాలోల్లయితేంది? కూటికి లేనోల్లంత కుప్పకూడిండ్రు. ఆకలికి కులం లేదని, అన్నానికి ఏరుడ్డం[27] లేదని ఎరుక సేసుకోవటానికి అల్లకు సానేండ్లే పట్టింది. గదంత అటెన్కగని గాళ్ళంతయితె జమయ్యిండ్రు. గట్ల కూడిన దాన్నే రైతు కూలి సంఘమనుకున్నరు....

లచ్చిం మల్లయ్య దుబ్బల[28] పిచ్చి గీతలు గీసుకుంట తన కడుపు నొప్పేందో ఎరిక జెప్పుకొంటడట. గందుకనే రైతు కూలి సంఘం పెద్ద బొత్తయ్య "వారీ! లచ్చిం మల్లు! గీ కిర్కాట మేందిర?" అన్నడు ఎత్తుబండమీన కూసుండి తుపుక్కున ఊంచి— బొత్తయ్యకు నిచ్చానికి బొత్త ఎత్తుగలేదు— ఊడ్సుక పోయున్నది. సిన్నప్పుడు కూడు దొరకక ఆకలికి అగక మన్నుదింటె బొత్త నీల్లకాగోల్లె అయితె బొత్తోడుగ పేరువడ్డది. బొత్త పెద్దగ ఇప్పుడు లేకున్నా సేతులు పొడుగ్గా, సండ్రి సాగె కర్రిలోగ్లె ఉన్నయి. అతని శలీరం మాగిన కుండోల్గున్నది. అతని కండ్లు చిన్నగున్నా బడే తేజుగున్నయి. అతనికి గియ్యన్నున్నా అయ్యన్నిటిని కప్పుకునేటందుకు పూరగ పేలికలేదు. ముడ్డికట్టుకున్న పేగు ఏరంగుదో ఎన్నేండ్లదో?— బొత్తయ్య గీ సంగం గింగం లేకముందు ఎత్తుబండల జూసినా ఎర్రెకండ్ల దొరను చూసినా బుగులు పడేటోడు. గ ఎత్తుబండ లెక్కేంత తీరుపాటం ఉండేదిగాదు— వారాల తరబడి సేన్లమీదనే ఉండెటోడు— గ పల్లెల అందరికన్న పూరగ బీదోడెవడంటె గ బొత్తయ్యే— అయినె పెండ్లాం సుక్కపోసు రయికె లేక ఉప్పుమిరపకాయకు ఊల్లెకు బోదు— పక్కున సవ్వేరుగదు— పదిమందితోని మాట్లాడెరుగదు— బొత్తయ్యకు ఆకలెరికె— మల్ల గ ఆకలితోటట్టు తను అరుగాలం కట్టపడ్డా కడుపు నిండక పోవటానికి దొరలే కారణమని అతనికి ఎవలు చెప్పకుంటనే తెలుసు— సిన్నమెత్తు కట్టపడకుంట ఆల్లెట్ల ఎంత మందిని ముంచి పైకచ్చిండ్రో ఇగురంగ ఎరికె.... మల్ల మల్ల దోపుకం[29]పోవాలంటే ఎదురుతిరుగుడు తప్ప ఇగ వేరే దారి లేదని ఊ మజ్జెన ఎరుక జేసుకున్నడు. తన తీర్గ తనొక్కడే కాదని కోట్లమందున్నరని— ఆల్లంత కుప్పకూడుతండ్రని, కూడి కలెబడతండ్రని, గెలుపు ఎప్పటికయినా తన సొంటిదేనని అతనికి మా దండినమ్మకం. గరీబెత్తం ఎంత ముదనష్టపుదో అదెట్లా కూలోల్ల కొంపలు కూలగొట్టగలదో? గ గరీబెత్తం ఎవలు కారణమో అతని కెరకె— అతని పసిపిలగండ్లిద్దరు కూడులేక కండ్లముంగట సచ్చిండ్రు. మల్ల వీరారెడ్డి



27. పేర్పాటు 28. మట్టిలో 29. దోపిడి

కొడుకులు పున్నమి సంద్రునితీర్గ దినదినం ఎట్ల ఎదిగి పోయిండ్రో అతని కెరికే-
గయ్యన్ని ఎరుకజేసుకొని గ ఊళ్ళోల్లకు ఎరుకజేత్తండు గన్కనే సంఘము పెద్దజేసింద్రు.

"కిర్తాట పేందే బొత్తన్నా! మీకందరి కెరికలేందేంది? కడుపుకు సాలక నేనుంటె కడుపుల కక్కుడు పొరుడయినట్టుగ కములపోతు గుండాపచ్చి సచ్చె- కాల్రెక్క లిరిగి కుప్పబడినట్టాయె. ఆనీని కాల్లు గడుపులు మొక్కంగ గ ఈర్రెడ్డి కాడ గుట్టకింది సేను రయినుకు[30]బెట్టి నూర్రూపాలు తెచ్చుకున్న- మా బక్కరాజి పుటుక- ఎన్నేండ్లయ్యిందో?...." ఎన్నేండ్లో లెక్క తేలక తల గోక్కున్నడు లచ్చింపల్లు.

ఎవడో కిసుక్కున నవ్వి 'ఏడేండ్ల'న్నడు.

"అగో ఏడేండ్లయ్యిందట- ఏటా గ సేను దున్నుకొని పండిన పంట తీస్కుంటండు- మల్ల రెండేండ్లు కల్లంమీనికచ్చి అడ్డి[31] గావాల్నని కుంచం బిందేసి కిటకిట మూడు బత్తాలు నింపుక పోయిండు- అప్పిచ్చినప్పుడు సేనుకు మునాఫా[32]లేదు, రూపాలకు అడ్డి లేదన్నడు- కని ఇప్పటిదన్క ఈర్రెడ్డి కెంతముట్టిందో మీరే లెక్కచేయిండ్రి."

"అమ్మ! లంజకొడుకు! నాలెముచ్చు.... గిట్లజేసే గంత సంపాయించిండు" ఎవలో అరిచిండ్రు.

బొత్తయ్య తలగోక్కొని ఏల్లు మలిసి పిటపిట సదివిండు.

"బొ.... నిచ్చమే.... ఎంత లేదన్న ఏలు ముట్టినయ్"

"బొ.... నిచ్చమే- నిచ్చమే...." మరిన్ని గొంతికలు పలికినయ్.

"మల్ల ఏంజేత్తామంటరు?...." బొత్తయ్య.

"చేసేటి దేమున్నది? అంగుతె తొక్కుతరు- నిలబడాల్ననె గద మనం సంఘం పెట్టుకున్నది? గీ ఊళ్లె దొరలు గింతగనం సెల్లిచ్చుకుంటాంటె ఇగ ఎక్కడూకుంటం- సంఘ మెందుకున్నది- గిసోంటి ఏల్లల ఆదుకోకుంటె- సప్పట్లుగొట్టి సెమ్మ సెక్క లాడుకోనా? పాటలు పాడి అదచ్చె ఇదచ్చెనని సంబరపడటానికా? నా కెరుకలేకడుగుత- గన్నెకురాల భూమి ఆడు గద్దాము మీని కుక్కోలె ముద్దికింద పెట్టుకునేదేంది? దున్నేదోన్కె భూముండాలె...." బాసయ్య అన్నడు.

"సోరోనివయిన[33] రామనక్కదనాల మాట సెప్పినావురా బానాలు" ఓ ముసలోడు మెచ్చుకున్నడు.

---

30. తాకట్టు 31. వడ్డీ 32. పంటలో వాటా 33. పడుచువాడు

"సనరాదురా! ఉచ్చిలోడా! అన్ని ఒక్కపారే అత్తయా? ఎనుకా ముంగట ఇసారం సేయద్దా?" బొత్తయ్య ముసిముసి నవ్వుత అన్నడు.

"హాఁ.... గుడిసెలు కాలిపోతుంటే ఎడ్డి బొమ్మడు అయ్య వారాని కచ్చినట్టు గున్నది సూడవోతే.... నవుతండు సూడు!" ఆడమనిషి గునిసింది.

రాయమల్లు నెత్తి గోక్కుంట నిలుసున్నదల్ల నోరు తెరిచింది.

"ఏందయ్య సూసేటిది? మా దండి పెద్దమొగోల్లు— తునికాకుల[34] కోతలప్పుడు కట్టకు ఏకాని[35]య్యమంటె గిట్లనే నీల్గలేదా? ఏకానకు మూడు జోడా లేసుకుంటననె. అని సొమ్మేం పోయింది? రాల్లల్ల రప్పల్ల చెట్టుచెట్టుకు దిర్గి కొమ్మకొమ్మకు పాకి ఆకులు కోస్తత్తె లేతాకనె, పచ్చులాకనె, ఆకరికత్తె గాలికి తూరుపాల బట్టె, పందిరిమీన ఇసిరేసుకునె, ఉల్వ[36] కట్టలకోసం జూసె— ఆఖరుకు దిగచ్చిండా లేదా? ఎక్కువతక్కువ మాట్లాడ్తె ఎండిన కట్టలు కల్లం మీనియి ఎవలయాళ్లు కట్టుకపోత మని ఎగబడితె— గప్పుడు రోగం దిర్గి అన్నంత పారేసిండు. అడుగంది అవ్వయిన బెట్టది— గింత మందుండంగ గ శంకర్రెడ్డి పచేలు మొగులుమీని కెగిరి పోతడా? గట్ల సాతగాక పోతె గాజులు పెట్టిచ్చుకోరాదుండ్రి" చేతులు తిప్పుకుంట చెప్పింది.

"ఔన"న్నరు కొందరు....

బొత్తయ్య పత్తాయించిండు.

"సరే! ఇయ్యాల్నె పంచాతు[37]" అన్నడు ఆఖరుకు.

"ఇంతకు మునుపు లెక్క— పంచాతి మూడు పానాదుల కాడి రాలసెట్టుకిందద్దు— గ భూమిల్నె జరుగాలె" వోటుగాలెంకటి అన్నడు.

"ఇంక పంచాతేంద్రుర? అహాఁ నాకెరుక లే కదుగుత— భూమి లచ్చింపల్లనిది, సోకు పటేల్ది— సొమ్మోడు సొమ్మెత్తుక పోంగ ఇంక బిడ్డమొఖం తీరవోక...."

"సనరాద్రుర.... మనగ్గాకున్న అళ్లకు గావాలెగద" బొత్తయ్య సదిరిచెప్పిండు.

సభ ఆఖరయ్యింది....

## 3

పంచాతు రాలసెట్టుకింద గాదు, గుట్టకింది రాల్ల సేన్ల— తీర్పు పెద్దలు పట్వారి ధర్మయ్య, పెద్దిరెడ్డి, నారాయణ, లచ్చుమారావు కాకుండ— సబ్బండవర్నాలు; మాదు

34. బీడీ ఆకులు 35. ఒక అణా 36. మామూలు (లంచం) 37. పంచాయతి

గులు, మన్నేలు, కాపులు, పెర్కలు, గొల్ల, కుర్మ, సాకల్లు, మంగల్లు, కుమ్మర్లు, కమ్మర్లు.... ఎవలైతేంది కూలి నా కొడుకులని తెలిపి వీరారెడ్డి తోకతొక్కిన తాసుపామోలె ఎగిరిండు. కాని కాపెయ్యటానికెవడు దొరుకలే- పడగ నేలకేసి కొట్టుకున్నంత బాధ పడ్డడు. గ గులాపు లస్కికొడుకుల కాడికి పోకూడదనుకున్నడు. తనెనుక ఊరి పెద్దలున్నరు. తేజనిపాజి[38] పాజినితేజి సేస్తరని నమ్మి ఆరునూరయిన నూరు ఆరయిన పంచాతు కాడికి పోవాలె ననుకున్నడు.

"ఊరు చరిత్రల అన్ని పంచాతులు రాలసెట్టుకింద జర్గెయి- ఊరికేదో సాశిద గాలం బుట్టింది. కూలి లంజకొడుకులు తెగబడ్డరు. దుర జెట్టకాలమచ్చింది. పారిటీలు కడుతుండ్రు. సేన్ల పంచాతంటె ఇదెక్కడి సోద్యం!" ఊరి పెద్దలు సెవులు కొరుక్కున్నరు. తీరుపు ముందే అనుకొని పకడ్బందిగ దాడి చెయ్యటానికి ఏలు కుదరనందుకు తెగ బాధ పడి పోయిండ్రు.

## 4

ఆ ఊరి రైతుకూలి సంఘ అధ్యక్షుడు బొత్తయ్య ఆనవాయితి పకారంగ ఆ మాటను పొరుగూల్ల సంఘాల కెరుకజేసిండు. పొరుగూరి సంఘం పెద్నాలు[39] పంచాతు కోసరం హుటాహుటిన అచ్చిండ్రు.

## 5

నెత్తిమీనికి పొద్దచ్చింది- మాడ మాడిపోయెటంత మండుటెండ- మృగశిర తొలి పాదం లున్నది. వారం రోజుల కింద భూమి తడుపు వాన కొట్టింది- గదాన్ని సూసుకొనే వీరారెడ్డి తొలిసాలు కోసం నాగండ్లు కట్టిచ్చిండు.

ఎర్రటెండల సేన్ల కచ్చిండ్రు రావాల్సిన వాల్లంత- సేన్ల అటిటు దిర్గిండ్రు- పెద్దమనుషులకు చిర్రెత్తుకత్తంది. గీ పంచాతంత ఉల్టా ఉన్నది. ఉత్తరపు గెట్టు మీది ఊకు చెట్టుకిందికి చేరిండ్రు పెద్దలు- గడంచలు, కుర్సీలు లేనందుకు సుంకరోల్లు, వంతగాల్లు లేనందుకు విసుక్కొని తలో పెద్ద రాయి సూసుకొని కూసున్నరు. అంత దూరం నడిసచ్చినందుకు ధర్మయ్యకు నిలువెల్ల సెమటల్ కార్తున్నయి- పెద్దిరెడ్డికి ఎర్రటెండను సూత్తె పెద్దమ్మ పూనినట్టుగున్నది.

ఇగ వీరారెడ్డికైతె ఇదంత చాన రోతగా, తలకొట్టేసినంత నామర్దాగ[40] ఉన్నది. అదిగాక సుంకరోల్లను గెదిమి గీల్లను తను పనుల కాడోల్లను ఇగ్గు కచ్చేది బోయింది-

---

38. సత్యాన్ని అసత్యంగా 39. పెద్దలు 40. అవమానంగా

బాకున్నందుకు లచ్చిమల్లని ఈవు చీరేసి బండలెత్తేది బోయింది- మాట్లాడటానికి గజగజ వనికే మంది గిక్కడ కుప్పకూడి తననే పంచాతుకు పిలిసిండ్రు- ఏకుమేక యింది. ఒంటిగ ఎవనికాడు ఉండి కులతప్పులతో తన్నుకొని సచ్చే కాలం బోయింది. ఏ మచ్చుమందు జల్లినట్టు గిల్లంత ఎట్ల ఒక్కటయినట్టు? పెయి కంగీలు లేని కూలి నా కొడుకులు, పూటకు గతి లేని లంజకొడుకులు ఎంతకు తెగిచ్చిండ్రు! ఒక్కొక్కన్ని మట్లకు గట్టేయించి ఎర్రటెండల చింతబరిగెలతోని తోలు ఒలిపిచ్చి కారంపొడి అద్దాలె బంచెత్.... సకురాలు సేత్తండ్రు- రాజ్జెం మంచిగలేదు. కాసూస్లెక్కువయినయి- కోరుట్లెక్కువయినయి. గీ లంజకొడుకుల జెల్లకు తోలాలె- వీల్ల అంతం సూత్త.... ఏడికి బోతరో సూత్త- కానున్న పనిని గంధర్వులే సేత్తరు. మా అంటె యిన్ని రూపాల్ అమీన్ మొఖాస గొడ్తె...." అనుకుంటాండు మనుసుల.

బొత్తయ్య దూరంగా ముంగాల్లమీద కూకున్నడు- అతనెనుక మిగిలిన మంది. పొరుగూరి బండయ్య బొత్తయ్య పక్కకు నిలుసున్నడు- అతని పక్కకు ఇంకో ఊరి సంఘ పెద్ద రామలచ్చులు పర్వతమోలె నిలుసున్నడు ఊరి పెద్దల అసహ్యంగ సూసుకుంట....

అందరు మాటపలుకు లేకుంటున్నరు- కని అందరి మనసుల్ల ఇసారాలున్నయి.

ధర్మయ్య అగ్గిపుల్ల గీకి సుట్ట ముట్టిచ్చిండు- ముట్టిచ్చి నిలుసున్నోల్లను, కూకున్నోల్లను ఓపారి కలెజూసిండు- ఎవనెవని మనుసు లేమున్నదో అల్ల ముఖాలె చెప్పుతన్నయి. ఓ ఎత్తుబండ కాని నిలుసున్న వీరారెడ్డి ముఖంలకు సూసి "పర్వాలేద" న్నట్టుగా బుచ్చికారి[41]నవ్వొకటి నవ్వి పొగనూదిండు. అటెనుక సేనును కలెసూసిండు. "సేను బంగారి తునుకే- అరుపైనా[42] అనయినా పుట్టెడు జొండ్లు ఒల్లఖ్ఖాలకు పార బోత్తది.... అబ్బో రెడ్డోని కన్ను మంచిదే- ఏదేరిన కంటికి అనిందాన్నే[43] ఏరుతడు" అనుకొని సేను పక్కకున్న అడివిని సూసిండు- "ఎంత కట్టె దెచ్చయినా గిదీంట్ల పాతర బెడితె ఒకనయ్యకు తెల్వదు. మాగిసయో[44] అడిగెటోడెవడుండడు" అనుకున్నడు.

"సూడుబిడ్డా! బొత్తన్నా! పిల్లజెల్ల మంచిగున్నార్రా! మంచిగనే ఉంటరులే- కనిపిచ్చుడు బందేసేసినవ్- ముఖ్యమంత్రిసోంటిది కన్నడ్తడు గని నువ్వు కనపడలేవ్.... సరె- ఏందుర్రో ఎవడు మాట్లాడ్తలేరు! బెల్లం గొట్టిన రాయోలె ఎందుకుంటర్ర? సల్లకచ్చి ముంత దాసేటిదేంది? గిది గుర్రం గిది మైదానం.... ఏదో అనరాదుర్రా!

41. కపటం 42. వానలేకున్నా 43. అనిన దానినే 44. పాతబడిన తర్వాత

ఎర్రఎండల గింతదూరం నడిపిస్తిరి" అన్నడు ధర్మయ్య- దసిలి తువ్వాల్ల చెప్పుపెట్టి మెత్తంగ గొట్టాల్నని మనుసుల అనుకొని.

"పంతులూ! మీ కెరుకలేం దేమున్నది- ఏడేండ్ల కింద అక్కెరబడి నూర్రూపాలు తీస్కున్న- ఏడేండ్లబట్టి ఏదో నాటప్పాసత్త[45] ఇంతింత కట్టుకుంటనేఅత్తన్న- పైసలిచ్చినేడు, పర్కోటేడు కల్లంమీన కుంచమేసుకొని ఏటా మూడు గిద్దెల జొండ్లు కొంటబోయిండు. నీ బాంచెన్- సంక లేవడితె ఖర్జం కండ్లబడ్తది.... గరీబోన్ని- పైసలియ్యంగ సేనుకు మునాఫా లేదన్నడు రూపాల కడ్డి లేదన్నడు. అసలు పందము కొల్సుక పోయిండు. ఇగ గరీబోన్ని, ఏ దిక్కు లేనోన్ని నా సేను నా కిడిసిపెట్టుండ్రి అని గట్టుకు మొక్కినట్టుగ మొక్కిన- సెషామంటె[46] సెషామన్నడు.... రయిను కాయితం నా దగ్గెరున్నది, నీ తాత్తోటి చెప్పుక పొమ్మన్నడు. ఇగ ఏడబోవాలె బాంచెన్...." లచ్చింమల్లయ్య మందిని జరుపుకుంట ముంగటి కచ్చి అన్నడు.

ఏడి నుంచచ్చిందో లచ్చింమల్లయ్య పెండ్లాం ఎల్లమ్మ సంటిపిలగాన్ని సంకల నుంచి పెద్దోల్ల కాల్ల మీనేసింది.

"గీ పోరని మొఖం సూడుండ్రి బాంచెన్- మావోల్లె కడుపుకు సచ్చె కాలం రాకుంట గ భూమి సెక్క సంపాయించినం.... గది....'' అన్నది దీలెపడి.

పెద్దోల్ల కాల్లు ఎనుకకు వోయినయ్....

ధర్మయ్య అఖరి పీల్చు పీల్సి ముక్కులనుంచి పొగ ఊది సుట్ట చెప్పు కాలుకిందేసి నలిసిండు.

''గదేబిడ్డా! మంచోల్లమో సెడ్డోల్లమో నలుగురం గీడ కుప్ప కూడినమ్. నలుగురున్న కాడ నారాయుడున్నడు- నా కండ్ల ముంగట గిసొంటి భూమి పంచాతులు నా ఎంటికలన్ని సూసిన- మాటమాటకు గిల్లెగిర పడ్డోన్ని నిన్నొక్కన్నే సూత్తన్న. నలుగురుండంగ ఆసకూసక నాగండ్ల కడ్డంబోతివి. అదెరా! ఈ ఊల్లె పెద్దమనుషులు సచ్చిండ్రనుకున్నవ! ఊరు పాడుపడ్డ దనుకున్నవ? సరెరా! సరె.... ఎనకటి నుంచచ్చె ఇలవరిసె[47] కాదని నువ్వ కొత్తసిరత్త[48] తొక్కినవ్- అదెపాయె[49] బిడ్డా! అదెపాయె! మీరంత ఎవలకాల్లు తెలివిమంతులైపోయి, కానూన్లు గినూన్లు ఎరుక జేసుకుంటె కాదన్నమా? మీటింగులు బెట్టొని పాటలు పాడుకుంటె అద్దన్నమా?.... ఊరు తెలివిమీది కత్తె మంచిదే గదరా! గదేమాట గాంధీ గుడుకన్నడుగద- గాంధ

189

45. ఓపిక కొద్ది 46. కాదంటే 47. ఆచారం 48. మార్గం 49. అయితే అయింది

సోంటోడు మీరు తెలివికి రావాల్నని అసంగ మాదేం లెక్క! కూలోల్లు బాగు పడా ల్ననె గద మేమంత అనుకునేది- గందుకనె సవారాజ్జం గుడుక తెచ్చిపెట్టిపాయె గాంధి. సచ్చేలోకంలున్నడో మారాజు! అయినా అత్తకు కోడలుమీన కన్నయినట్టు మీకు మామీన కన్ను! కట్టంల, రోగాలల్ల, నొప్పుల్ల, ఆపతికి, సంపతికి ఎంతాదుకున్నా మీకు మామీన నమ్మకం లేకుంటయిపోయింది. కాలం మంచిగలేదు. దునియ చెడి పోతంది. దురుజెట్ట కాలమచ్చింది. నడిత్తాల్లె[50] దిని కొసిత్తాల్లె[51] ఏర్గపోయే[52] కాల మచ్చింది. మీరంటె మీరుగాదు- మంది మాటలు బట్టుకొని సంఘాలు గింగాలంటే మీరే చెడిపోతరు. మా కాలంల సంఘాలుంటెనే బతికినమా? ఎనుకటెవడో ఏరుగ బోయి చెరువుమీన అలిగిండట- చెరువుకచ్చే నట్టమేమున్నది? అని ముద్దే ఎండిపోద్ది. మంది మాటలు బట్టుకొని మారుమానం[53]బోతె మల్లచ్చేటాల్లకు ఇల్లు గాలిపోయిందట- మీకెవలమీన్నో మాకంటెక్కువ నమ్మక మేర్పడిపోయింది. ఆసక నేను సూడకపోను- నమ్మి నానబోత్తె పుచ్చి బుర్రిలు కాకపోవు.... అయినదానికి కానిదానికి కట్టగట్టుకొని అత్తండ్రు. మీకు గిన్ని సేత్తే మా మీన్నే కారాలు మిరియాలు నూరుతండ్రు" ధర్మయ్య గుక్కతిప్పుకున్నడు.

"గదంతెందుకు ధర్మయ్యా! ఎవని కర్మ వాడే అనుభగిత్తడు- మల్ల పంచా తంటె ఎకురారునామ[54] ముచ్చిలుకలు[55] దడావతు[56] లేమన్న ఉన్నయా?" పెద్దిరెడ్డి కాండ్రికిచ్చి ఊంచి అన్నడు.

బొర్తయ్య అసహనంగా కదిలిండు- అటిటు సూసిండు.

పొరుగూరి బందయ కలుగజేసుకొని "దడావతులు గిడావతులేంది? కడుపుకు గంజిలేనోనికి గ పైసలేన్నుంచత్తయి?" అన్నడు.

"అదిగాదురాండ్రి! దడావతులు లేకుంట పంచాతేడ సడుత్తది? మున్సిఫ కచ్చేరసోంటిది[57] తప్పుదండుగు నేయించి సిచ్చేత్తది గాదుర- వారీ! అన్ని మీయే సాగాలంటెట్లరాండ్రి! ఊల్లె పంచాతంటె గీడికి పట్టుకత్తిరి. ఇగ తప్పు నాయం నేయ్యంచకుంటెట్ల?" ధర్మయ్య.

"పుర్రెలు పలిగినయా? నెత్తురు కారిందా? లచ్చింమల్లనిది భూమి. అనికిప్పి య్యాలంటె మల్ల దడావతులేంది మజ్జెన? ఎనుకటి కెవడో శాత్తరం చెప్పినట్టు

50. నడి విస్తరిలో 51. కొస విస్తరిలో 52. మలవిసర్జన చేసే 53. రెండో పెండ్లి 54. ముద్దాయిలు ఉమ్మడిగా రాసుకునే ఒప్పందం 55. ముద్దాయిల వ్యక్తిగత పూచీ పత్రాలు 56. మధ్యవర్తి వద్ద వుండే డబ్బు 57. మున్సిఫ్ కోర్టు కూడా

190

గున్నది కత : పంచాతు చెప్పు పెద్దన్నంటె సుక్కేసుకోవాలె పైకం గావాలన్నడట ! ఊరుగా లొకదేడిత్తె ....గాలొక దేడిసినట్టున్నది ఎవారం” ఇంకో ఊరి రామలచ్చులు.

“నిన్నెవడు మాట్లాడుమన్నరా? అంబట్ల తెడ్డోలె మజ్జెతుకత్తన్నవ్” వీరా రెడ్డి కసిరిండు. అతని కండ్లయితె ఎర్రంగ మండుతన్నయ్.

ధర్మయ్య “సయిసు[58] సయిసు....” మని చెయ్యూపిండు- అతనికిదంతా తలకిందుగా జర్గుతున్నట్టుగా ఆనిపిచ్చింది. తాపేది చెప్పుతె అది ఊఁ అనేటోల్లు ఆల్లే చెప్పుతండ్రు. అయినా తామూలుకచ్చి బయటపడకుంట కొండ్రికిచ్చి ఊంచిండు.

“ఇగో బొత్తయ్యా ! ఊరున్నకాడ మాదిగిండ్లుంటయి- కట్టం సుకం ఉంటయి- దొరలు, దాతలుంటరు- పనిపాటలోల్లు, అగ్డోడు, కమ్మరోడు, కుమ్మరోడు, కూలోడు ఎందరో ఉంటరు. ఎవల పనాల్లు జెయ్యకుంటెట్లెల్లుతది? మల్ల అందరికి అక్కెర సక్కెర్లుంటయి- వారీ ! మనల నెవడడిగిండురా ! అరిచ్చంద్ర మారాజసోంటోనికి ఓమాటకత్తె అక్కెరబడ్డది- మాటా మరోటా ! మాటకోసం పెండ్లాం పిల్లల అమ్మి మాట నిలబెట్టుకున్నడు- అప్పుగట్టిండు. ఎందుకురా? అరిచ్చంద్రి మారాజు నీతి మంతుడు- సచ్చెమంతుడు- ఎవని రుడంల పడిపోయినా నరకం తప్పదని ముంగటి కాలాన్నెరిగినోడు.... వారీ ! ఈ ఊళ్లె అక్కెర బడనోడెవడు? అప్పు తీస్కోనోడెవడు? అప్పున్నకాడ అడ్డి ఉంటది- ఉత్తగెవడిత్తరాని? మీదాకెందుకు? నాట్లమీద నాకక్కెర బడ్డది- షావుకారి నంబయ్య కాడికి బోతె ఉత్తసెయ్యి సూపిండు. మల్ల దొర్సాని కంటె, కోడలుమీని గొలుసు తీస్కపోతె పైసలిచ్చిండు- మల్ల నగలు బెట్టిన్నని అడ్డి తీస్కోలేదా? నూటికి మూడు రూపాలు దంచి పుచ్చుకున్నడు- చెప్పచ్చేదేమంటే- కొలువా కుమ్మరియ్య[60] మూడె ముచ్చట్లు- కట్టె కొట్టె తెచ్చె నన్నట్టుగ- ఎవలవద్ద మాడినా[61] అద్దమసొంటి కాయితమున్నది- ఈడ నలుగురున్నరు- లెక్క సేపిచ్చుకో- నువ్విచ్చేటి యేమున్నయో అయి ఈ రెడ్డి ముకంమీసకొట్టు- నీ సేను నువు బాజాప్తుగ[62] తీసుకో....”

వీరారెడ్డి పక్కజేబుల్నుంచి కాయితంతీసి ధర్మయ్య సేతి కిచ్చిండు. ధర్మయ్య అద్దాలు పెట్టుకొని ఏందో పేరు సదివిండు. రాగం తీసుకుంట కాయితమెల్ల సదివిండు. “తీసుకున్న రూపాలు అక్షరాల ఇన్నూరు ... ఇందుకు అడ్డి నెల ఒకంటికి నెకడ[63] ఒకంటికి పదిరూపాల సొప్పున అడ్డి అసలిచ్చి నా దస్తవేజు నేను తీసుకొందును-

---

58. ఆగు 59. (మెడ) నగ 60. కొలవడమూ, కుమ్మరియ్యడమూ
61. ఎవరు అబద్ధమాడినా 62. చిట్ట ప్రకారంగా 63. నూరు

ఇందు నిమిత్తము సర్వే నంబరు 204 గల నా స్వంత చేను కాస్తు[64] చేసుకొని ఫల సాయము అనుభవించగలవు- ఇది నా యిష్ట పూర్వకంగా వ్రాయించి యిచ్చిన దస్తా వేజు సహి.... దస్తూరి పెద్దిరెడ్డి...."

"అవద్దం...." లచ్చింమల్లయ్య అరిచిండు.

"ఏవోయి పెద్దిరెడ్డి నువ్వే రాసినవ్ గద ?"

"ఔ.... గప్పుడు రాసింది యాదికె మున్నది గని- ఇన్నూరు రూపాలు నాసేతు లతోనే ఇచ్చిన...." అన్నడు పెద్దిరెడ్డి.

"మీసేత మీరే ఒక్క నూరు రూపాల నోటిత్తిరి- సిల్లర నాకేడ దొరుకుతది బాంచెనని నేసంటె, నాకాడన్నా లేదని మీరంటిరి- నూటికి అయిదు రూపాల అప్పని అయిదేల్లు సూపితిరి...." లచ్చింమల్లయ్య యాదికి తెచ్చిండు.

"ఆగాగు.... కింద నీ ఏలు ముద్దరున్నది...." ధర్మయ్య.

"ఔను పంతులూ ! సదువా సాత్తురమా ! పసురమసోంటోల్లం ! ఎంతరాసినా ఏలుముద్దరేత్తం" లచ్చింమల్లయ్య గొంతిక జీరబోయింది.

పెద్దిరెడ్డికి గయ్యన్ని యాదికి రాలేగని, తనకిచ్చిన పదిరూపాల నోటు గురుతు కచ్చింది.

"అడ్డి నూటికి పది రూపాలు.... ఎన్నేండ్లయ్యింది.... ఏడేండ్ల పది నెల్లు.... అధిక మాసాలు రెండు గలుపుకుంటె ఎనిమిదేండ్లు...." అని పోంటీను[66] దీసి కాయితం ఎనుక కెల్లి లెక్క జేసిండు ధర్మయ్య.

"ఇన్నూటికి నూటికి పది సొవ్వున ఇరువై రూపాలు.... ఏడాదికి ఇన్నూట నలువై.... ఎనిమిదేండ్లకు వడ్డి అసలు గలిపి రెండు వేల ఒకవంద ఇరువై.... ఇన్నూరురాసి ! అడ్డికడ్డి గట్టలే- దానంతుకు ఏమో ఇత్తులు గొలిసిన్నంటివి. అదిగాక పంట గుడుక తీసుకున్న డంటివి." ధర్మయ్య ఆఖరు గీత తిరుగులేని గీత గీసి కండ్ల ద్దాలు తీసి పట్టుకొని అందరి ముఖాల సూసుకుంటు అన్నడు.

ఆడ నిలబడ్డోల్లు ఒకల మొఖాలొకలు సూసుకున్నరు బీరిపోయి.

బొత్తయ్య కొంచం ముంగటికి జర్గిండు.

"ఇంతవరదనుక తమరు సాత్తురాలు పురండాలు సెప్పిండ్రు- ఇగ నేను జెప్పు తినుండ్రి. దచ్చినాన కొండపురి రాజ్జముండేదట- కొండపురిని చండ భూపాలరాజు

64. వ్యవసాయం 65. నిజము 66. పెన్

ఏలెటోడట- గసోంటి రాజ్జెంల ఉన్నట్టుండ్ ఉన్నోల్లు ఇంకింత బలిసిపోయి, లేనోల్లు ఆకలికి సచ్చె దెవుస[67] వచ్చిందట- ఇగ ఆకలికి సచ్చె కూలి జనమంత కట్టకట్టుకొని రాజు కాడికెల్లి మొరపెట్టుకున్నరట- "హే రాజా! ఇగ నువ్వు ఆదుకోకుంటె మా పానాలు పోత" యని. రాజ్జమంత పీనుగుల పెంటయి పోతందని సూసినోల్లు రాజు దగ్గెర చెప్పింర్రట, రాజు గప్పుడు కండ్లు తెరిసి మంత్రిని బిలిసి ఖజానా ఖాలైనా పరువలేదు, ధాన్యం గీన్యం అందరికీ పంచిపెట్టన్నడట- మంతిరి నవ్వి "హే రాజా! ఉత్తగిత్తె జనం పనులు మానుకుంటరు- ఏట గిదే ఏషమేత్తరు- మనకుసుత పైక మెట్లత్తది?" అన్నడట- అని అందుకొక ఉపాయం జెప్పిండట- మన రాజ్జెంల తొవ్వలు బరాబర్ లేవు- కనుక ఇయ్యేడు తొవ్వలేయించుదాం- ఆ పైకం గుదుక ఆళ్లకందాలంటె సేపిచ్చెటోన్ని ఉన్నోన్ని పెట్టద్దు- గ బీదోల్లండ్లోన్నే ఏరుకొని అనికి పైకమప్పచెప్పి పని జేయించుకుందాం- పనికి పని, ఆళ్ల ఆకలికి ఆకలి తీర్తది- రాజు సరే నన్నడు. గరీబోల్లల్ల ఎతికెతికి అతిలావు పేదోడైన పుల్లయ్యను పెకెదారు[68] చేసిండట. అయిపాయె పని మొదలైంది- కూలోల్లు పనిజేత్తండ్రు- కడుపుకు తింటండ్రు- ఉన్నట్టుండి పుల్లయ్య పెయికంగి దొడిగిండు. తెల్లారి పని ఇసిరెలు[69] తట్టలు, పారలు, గడ్డపారలు గొన్నడు. జనానికి అనుమాన మచ్చింది- నిలదీసిండ్రు- మీరు పనికి రాకుంటెమాయె అన్నడు- ఏరే దేశం మనుషుల తెత్తనన్నడు. జనం పని చేయాల్నంటె తట్టలు, పారలు, గడ్డపారలు గావాలె- గయ్యి పుల్లయ్య దగ్గరున్నయి- ఎనుక ముందాడిన పల్లె పుల్లయ్య కిందికే పనికి బోతండ్రు- పుల్లయ్య గిప్పుడు సలువ బట్టలేసుకొని సేతులూపుకుంట అటిటు తిర్గుతండు- పని సూసెటాన్కి పెకెదారును బెట్టుకొన్నడు. ఊల్లె భూములు, బంగుళాలు కట్టిచ్చుకున్నడు. అయిపాయె తొవ్వలయిపోయినయ్- రాజుగారిచ్చిన పైకం లెక్కసూపెట్టిండు- పల్లె కూలోల్లకు ఏమి మిగులలే- పుల్లయ్య మాత్రిం పాలేరోల్ల బెట్టుకున్నడు. గిదెంట్ల పుల్లయ్య ఏడినుంచి పెర్గిపోయిండో? ఎట్లా పెరిగిపోయిండో? పల్లె కట్టపడ్డ జనం కట్టంల్నే ఉంటె పుల్లయ్యొక్కడు ఎట్లా పెరిగిపోయిండు?" బొత్తయ్య కత సెప్పుట మాపిండు- అందరిని సూసిండు- "గీ కతల ఇంకొక సిన్న లిటిగేషనున్నది పంతులూ! బీదోల్ల నుంచి పైకచ్చిన పుల్లయ్య బీదోల్లకు సోకు తవ్వెడు అప్పిచ్చి, భూములు రాయించుకున్నడు- గిప్పుడు గ పుల్లయ్య అప్పులియ్య గలడు- అడ్డీలు తీస్కోగలడు. గట్ల అప్పి చ్చేటానికి పైక మేడినుంచచ్చింది?" బొత్తయ్య కతాపిండు....

---

67. దినం 68. పనిచేయించే గుమాస్తా 69. పనిముట్లు

"ఎట్లంటవా ? రాజుగారు బంటకు[70] గింతియ్యమని సెప్పుతె అందట్లది సగం జేబులేసుకున్నడు. పల్ల పెకెదారుగిరి జేసినందుకు కయికిలి[71]చ్చిరి. అదిది గలిపి ఎక్కువయ్యింది- గట్ల పెరిగిపోయింది...." పొరుగూరి రామలచ్చ.

"గదంత భారత మెందుకు ? కూలోల్ల ఆకలి బతుకుల్ల నుంచి సాయారం టీల్చి పుట్టకుక్కోలె పొడుసుక పైకిపోయిండు" ఇంకెవరో అన్నరు.

"అద్గదీ.... పల్ల పుల్లయ్య అప్పిచ్చిన పైకమేడిది ?" బొత్తయ్యన్నడు.

"కూలోల్లదే...." చాలా మందన్నరు.

"వారీ ! అదురుట్టమురాి.... సేతికున్న ఏల్లన్ని ఎందుకు ఒక్కంత పొడుగు లేవు సెప్పుండ్రి...." ధర్మయ్య ముఖం జేవురించంగ అన్నడు.

"గయ్యన్ని సాత్తరాలు తీరుపాటంగ చెప్పుకునేరు గని ముంగలబడ్డ దాని గురించి మాట్లాడుండ్రి...." పెద్దిరెడ్డి.

గప్పుడు ఒక్క పోశాలు గుకుపకట్టెపీన గద్దువానించి నిలుసున్నోడు కపోప్పెగ్గె నోరు తెరిసిండు; "ముంగల బడ్డదేందుండ్రి.... ముంగల బడ్డదీ ! కతంటె గుర్తు కచ్చింది. పెండ్లి సేసుకొని, సాది, సవరిచ్చెనసేసి కూడుబెట్టి, కోక గొని, తలకు సమరు[72] గొన్నంక.... తీరా సమర్తయి ఎదిగిన దాన్ని.... ఎదిగింది నాదే బంచోతన్న డట ఎనుకటెవడో గిసోంటి దొర. గీ సెలుక లచ్చింపల్లనిది- ఆడు సాెడు రకుతం పురెసెడు సేసుకొని గిదీన్ని సేను పోవడికి దెచ్చిండు.[73] నూ(రూపాలిచ్చి కొంటబో యేటియన్ని కొంటబోయి పల్ల నాదంటె గిదెక్కడి నాయెం ?" అన్నడు.

ధర్మయ్య పండ్లు పటపట గొరికిండు.... 'బక్క పోశడు తన పాలేరే ! లంజ కొడుకులకు మదమెక్కింది ! మాటకు మాటందిత్తండ్రి' అనుకున్నడు మనుసుల. అనుకొని లేసి నిలబడ్డడు- భుజం మీని పంచె గూడిచ్చి దులిపిండు కోపంగ.

"అప్పట్నుంచి సూత్తన్న- నువ్వు తాములుగ సముజ[74]కొద్ది మాట్లాడ్తాంటె, అల్ల తీకునాలు దీసి మాట్లాడ్తండ్రి- దమ్ము కొత్తన్న"[75] వీరారెడ్డి నిట్టనిలువుగ నిలుసుండి అన్నడు.

"మదమెక్కింది బాంచోతు" పెద్దిరెడ్డి.

"నువ్వు గడ్డలకు గడ్డలు తీసి పెడితె...." పందిల ఎవతో గునిసింది.

బొత్తయ్య సుత లేసి నిలబడ్డడు- సేతులూపుకుంట....

---

70. నిర్ణీత కొలతలుగల మట్టిపొక్క 71. కూలి 72. నూనె
73. చేను వలె చేసాడు 74. అర్థం 75. ఓపిక పడ్తున్నా

"తమరు పెద్దలోకులు- ఇప్పటికే సమజ్ చేసుకోవాలె- ఈడిదనుకచ్చిండ్రు- లచ్చింమల్లడు తీసుకున్నయి నూర్రూపాలు. రెండేండ్లు ఆరు బత్తాల జొండ్లు కొలుసుక పొయిండు పటేల్. ఎంత లేదన్నా గయ్యే మున్నూరయితయి. ఏటా ఫసలు తీసుకుంటాండ్రు. ఏటా ఎంత లేదన్న పది గిద్దెల జొండ్లయితె భూమి పాలు గట్టుండ్రి. ఏటయిదు గిద్దెలు రెండు పుట్లయితయి. గ లెక్కన సూత్తె ఈ రెడ్డి పటేలే లచ్చింమల్లనికి బాకి తేలుతడు. మల్లింక పెద్దలకు మేం చెప్పేదేమి లేదు. గరీబోల్లం, గులాపోల్లం. దొరలు పారసూసుకోవాలె. కాదంటిరా మీ తొవ్వ మీది మా తొవ్వ మాది...." అన్నడు సిట్ల సివరకు.

"ఎందిర మీ తొవ్వ?" వీరారెడ్డి అరిచిండు.

"వారీ! లచ్చింమల్లా! నాగలి గట్టు- నీ చేను నువు దున్నుకో- మంచి మాటకు సెప్పినం- ఇగ దొరలిట్టం...." బొత్తయ్య.

"బొత్తన్నకూ - జై" అన్నరు అందరు.

వీరారెడ్డి కెటు పాలుపోలే- గిదగిద బొత్తయ్యమీని కురికచ్చిండు. బొత్తయ్య ఒడుపుగ తప్పుకోకుంటె దవుడ పలిగేదే.

వీరారెడ్డిని ధర్మయ్య పట్టుకున్నడు.

అరుపులు కేకలు మొగులు ముట్టినయ్- ధర్మయ్య వీరారెడ్డిని తీస్తాని అచ్చిన దారి బట్టకుంటె ఏమయ్యేదో?

లచ్చింమల్లయ్య నాగలి కట్టిండు- నాగలి నడిచింది.

"లంజ కొడుకుల్లాలా! మీరంత కమినిట్లయి పోయిండ్రు. పోలీసోల్ల తీస్కచ్చి చితల్ చితల్ పొడిపిస్త ఏమనుకున్నరో?" గిట్ల అంతుపొంతు లేకుంట అదురుకుంట[76] పెద్దమనుషులు ఎంటరాంగ వీరారెడ్డి ఊరికెల్లి ఎల్లిపోయిండు.

"అన్నిటికి తయారుగున్నం. ఎవడచ్చినా బే ఫికరే.... పోలీసోల్లుగాదు, ఆల్ల తాతల దీస్కరా! నాయెం మా ఎనుకున్నది. అంతదాకత్తె- తెగిన బొక్కెన నూతిల దాక. మా రెక్కలే మాకు బలం. ఇవ్వాళదనుక అంగిస నడుమెత్తకుంట కట్టం జేసి కడుపుకు సచ్చినమ్. కడుపుకు సాలక గీ రెక్కల్నే మర్రేసినమ్" బొత్తయ్య అన్నడు.

"మా మద్దతు గుడుక ఉంటది. ఏం జేత్తరో?" పొరుగూరోల్లు అన్నరు.

"సంఘానికీ"

"జై" అన్నరు అందరు. అడివి పిట్టలు గుడుక బదులు పలికినయ్ "జై" అంటున్నట్టు.

195

76. వదురుతూ